

# డాక్టరు ఆనిబిసెంటు

మిగలముగ్గిన పండు, బిసెంటుదొరసాని జర్జరిత దేహం విడిచిపెట్టింది. ఆమె అస్థికలను డి. కె. తెలాంగుగారు కాశీలో గంగలో కలిపారు. ఆభౌతికదేహం యొక్క శేషం యిక లేశమైనా లేదు.

జీవన్ముక్తు లే వొకరిద్దరో తప్ప తతిమ్మా గిట్టినవా రంతా మళ్లీ పుట్టవలసిందే; కాని వారికి కాలనిర్ణయం చెయ్య లేము. అప్పుడే కావచ్చు. కొంచెం నిడివి మీద కావచ్చు. వేల యేళ్లకు క వచ్చు. బిసెంటు మాత్రం యిప్పటికే యేభాగ్యవతి గర్భం లోనో ప్రవేశించి వుంటుంది. ఎంచేత నంటే? క్షణక్షణమూ ఆమె చెయ్యవలసిన పని చాలా వుంది. ఆపని ఆమే చెయ్యాలి; గాని మరి వొకరివల్ల కాదు. ప్రవర్ధమానమైన మరో దేహం సంపాదించుకోడానికే ఆమె యీ బడుగుమేను విడిచిపెట్టింది; కాని మోక్షం కోసం కాదు. యముడికి లొంగి పోయి కూడా కాదు.

ఇంగ్లండులో పుట్టడం యిండియాలో గిట్టడం పుణ్యం వల్లనో, పాపం వల్లనో పాశ్చాత్యులకు అనేకులకు తటస్థించవచ్చు; కాని బిసెంటు మాత్రం యిండియాలో గిట్టడానికే యింగ్లండులో పుటింది. ఆపుట్టడం కూడా యిక్కడే కాగూడదా అంటే అవడం వస్తే యిలా జరగడం తటస్థించకే పోవును. ఏమంటే? ఇప్పటి హైందవ రక్తంలో పాశ్చాత్యరక్తంలో వున్నంత దార్ఢ్యమూ, పెంకితనమూ, కార్యదీక్షా, ఏకాగ్రతా లేవు. అవి వుంటేగాని యిప్పట్లో యిక్కడ కార్యక్రమం జరగదు.

1916 దాకా మనవా రనేకులు రాజకీయోద్యమం సాగించారు. అయితే: విద్యాధికులు మాత్రమే ఏకొద్దిమందో అందులో చేరారు; కాని బిసెంటు రాజకీయరంగంలో ప్రవేశించి హోమ్‌రూలు మూవ్మెంటు లేవనెత్తింది. దానితో సేతువు మొదలు శీతాచలం దాకా పల్లెపల్లెకూ ఉ ప్పందింది. దృఢమైన ఆపునాది వుంది కనకనే తరవాత తప్పుదారిలో నైనా గాంధిగారు వొక అంతస్థు వెయ్యగలిగారు.

బిసెంటు కాశీలో వేసిన సెంట్రలు హిందూకాలేజీ పునాది మీద మాళవీయ పండితుడు బ్రహ్మాండమైన హిందూయూనివర్సిటీని లేవనెత్తినాడు. ఆమె మన మదనపల్లెలో గూడా అలాంటి కాలేజీ నెలకొల్పింది. అయితే: దాన్ని ఆంధ్రవిశ్వ విద్యాలయంగా తయారు చేసుకోలేకపోవడం అలా వుండగా ఆరూపంలో నేనా మనం దానికి వికాసం కలిగించలేక పోయాం.

బిసెంటు ఉత్తరదేశంలో స్థిరపడి వుంటే జొత్తరాహు లామె చేయూత మీాద ఇంకా ఎంతెంతపను లేనా చేసి వుందురు. నిజానికి దాక్షిణాత్యులు ఆమెకి తగిన అనుచరులు కారు.

అయితే, ఆమె మద్రాసులో యెందుకు స్థిరపడిందీ అంటే ఆమె స్థిరపడింది కనక నే మద్రాసు యీస్థితికేనా రాగలిగింది ఆమే యిక్కడ వుండకపోతే ప్రపంచకంలో అన్ని ఖండాలలోనూ, అన్ని దేశాలలోనూ వున్న గొప్పగొప్ప విద్వాంసుల దృష్టీ, సాధకుల ఆశలూ ప్రసరించడానికి మద్రాసులో యేం విశేషం వుందీ?

పోనీ: బిసెంటు సాహచర్యం వల్ల మద్రాసులో ముందుకు వచ్చిం దెవరు? మొదబట్టి మనల నెవరూ వెనక్కి పడగెంటలేదు. ప్రత్యేకంగా బొట్టుపెట్టి ఆమె కూడా యెవర్నీ పిలవలేదు; కాని సహజమైన ప్రగమనశీలతవల్ల అరవ లామె చాపిన చెయ్యి పట్టుకొని ప్రయోజకులైనారు. ఎక్కణ్ణుంచో వచ్చి మహారాష్ట్రులు కూడా అడయారులో ఉత్కర్ష పొందారు; కాని మన కేమీా అంట లేదు.

అయితే, వొక టుంది. మద్రాసు ప్రభుత్వం తనకి ప్రవాసశిక్ష విధించినపుడు న్యూయిండియాపత్రిక నడపడానికి అరవలలో ఆమెకి అర్హుడు కనపడ లేదు. ఇందుకోసం ఆమె డి. కె. తెలాంగు గారిని పనిబూని బొంబయినుంచి రప్పించింది.

అందులో ఆమె విశ్వాసం అపాత్రన్యస్తం కాలేదు. తెలాంగుగారి సంపాదకత్వంలో న్యూయిండియాకి పాఠకవలయం పెద్ద దయింది. పదవి అతిశయించింది. గౌరవం హెచ్చింది; కాని యే లోటూ రాలేదు చూశారు కాదూ, గాంధిగారి చేతిలో వున్నప్పుడు యాభై వేల చందాదార్లున్న యంగిండియాపత్రిక రాజగోపాలాచారిగారి చేతిలో పడి నాలుగు వేల చందాదార్లలోకి తగ్గి కుండలోకి వచ్చిందీ?

మనలో ముందుజన్మలో ఇంగ్లండులో పుట్టతగ్గవారు కొందరున్నారు; కాని వారి వల్ల యింగ్లండు కేమీా మేలుకలగదు. సంఖ్య మాత్రం పెరుగుతుంది. అంతే. అయితే బిసెంటు సంగతి అలాంటిది కాదు. ఆమె తత్వానికి హిందూదేశం సరిపడినట్లు పాశ్చాత్యదేశాలు సరిపడవు. కనక ఆమె యిక్కడే పుడుతుంది. హిందూదేశానికి ఆమె వల్ల మాత్రమే కలిగే ఉన్నతి యింకా చాలా వుంది.

నిజానికి బిసెంటు జీవితం వొక మహాసముద్రం. అందులో భీమకాంతాలైన యాదోర్త్నాలు పుష్కలంగా వున్నాయి. అంచేత అది అధృష్యమూ, అభిగమ్యమూ కూడానూ.

